క్లుప్తంగా

రీసర్వేకు రైతులందరూ సహకరించాలి



కోడూరు: రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రీసర్వేకు రైతులందరూ సహకరించాలని తహసీల్దార్ శ్రీనునాయక్ కోరారు. మండలంలోని మాచవరం పంచాయతీ పరిధిలో బుధవారం నుంచి భూముల రీసర్వే ప్రక్రియను ప్రారంభించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న రీసర్వే వల్ల రైతులకు మేలు జరుగుతుందని, భూముల హద్దులు కచ్చితంగా తెలియడంతో పాటు సరిహద్దుల వివాదాలకు తావుండదని తహసీల్దార్ తెలిపారు. ప్రతి సర్వే నంబర్‌కు సంబంధించి సర్వే జరుగుతుందని, రైతులు తమ పట్టాదార్ పాస్‌పుస్తకాలు జిరాక్స్‌లతో స్థానిక రెవెన్యూ అధికారులను సంప్రదించాలన్నారు. ఇప్పటికే పిట్టల్లంక పంచాయతీలో రీసర్వే ప్రక్రియ పూర్తి అయిందని, మిలిగిన పంచాయతీల్లో కూడా ఈ సర్వేను నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం రీసర్వేకు సంబంధించిన గ్రామసభను జరిపి, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. రీసర్వే డీటీ పద్మప్రియ, ఆర్‌ఐ సుభాషిణి, వీఆర్వోలు, సర్వేయర్లు, గ్రామప్రముఖులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

కృత్తివెన్ను: నేటి యాంత్రిక జీవనంలో కలుషిత ఆహారాన్ని వదిలి పోషక విలువలు కలిగిన ప్రకృతి వ్యవసాయం ద్వారా లభించే ఆహారాన్ని తీసుకోవడం మానవ మనుగడకు జీవం పోస్తుందని జిల్లా అదనపు ప్రాజెక్ట్ మేనేజర్ నాగమల్లేశ్వరి అన్నారు. బుధవారం మండలంలోని యండపల్లి, చెరుకుమిల్లి గ్రామాలలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామసభలు నిర్వహించారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సమగ్రమైన సమాచారాన్ని అందరికి అందించాలని ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలన్నారు. ఈ ఏడాది 32 రకాల పీఎండీఎస్ విత్తనాలను పొలాలలో వేసుకుని భూమిని బలోపేతం చేసుకోవాలన్నారు. ఏటీఎం కిచెన్ గార్డెన్స్ వేసుకుని కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. యండపల్లి, చెరుకుమిల్లి సర్పంచ్‌లు పిన్నెంటి ప్రభుప్రసాద్, పట్టపు కృపావేణి, ఎస్ఎఫ్ఏ నాగేశ్వరరావు, డీఎంఎంటీఓ స్వామిబాబు తదితరులు పాల్గొన్నారు.

చిలకలపూడి(ఘంటసాల): మండలంలోని చిలకలపూడి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం యాక్షన్ ప్లాన్- 2025 గ్రామ సభ బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిలకలపూడి సర్పంచ్ కొణతం విజయలక్ష్మి, చిట్టూర్పు ఇన్‌చార్జి వెల్దుర్తి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి సోమయ్య మాట్లాడారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం గురించి తెలిపే పోస్టర్లతో ర్యాలీ నిర్వహించారు. వీపీఓలు, డ్వాక్రా గ్రూపు మహిళలు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించండి

పెడన: పట్టణంలోని బ్రహ్మపురం మీదుగా గూడూరు వెళ్లే సీసీ రోడ్డు మరమ్మతులను తక్షణమే చేపట్టాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన గూడూరు రోడ్డును మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2003లో నిర్మించిన రోడ్డు అక్కడక్కడ దెబ్బతిందని, తక్షణం మరమ్మతులు చేపట్టాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, ఏఈ సీతారామాంజనేయులు, టీడీపీ నాయకులు యక్కల శ్యామలరావు, కమ్మగంటి వెంకటేశ్వరరావు, వాహెబ్‌ఖాన్, వీణం శ్రీనివాస్ తదితరులున్నారు.

ప్రజాదర్బార్‌లో అర్జీల స్వీకరణ

పెడన టీడీపీ కార్యాలయంలో బుధవారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు అర్జీలను అందజేయడంతో వాటిని పరిష్కరించి తగు చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు.

అవినీతి రా..బంధు(వు)లు

- చిన్నాపురంలో 8 ఎకరాల ప్రభుత్వ భూమి హాంఫట్
- ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల్లోనూ అదే చేతివాటం, అవే వాటాలు
- చిన్నాపురంలో బాబాయ్, అబ్బాయిల అవినీతి భాగోతం
- ఊరి పరువు తీస్తున్నారంటూ మండిపడుతున్న గ్రామస్తులు
- కుమ్మక్కైన పంచాయతీ, రెవెన్యూ అధికారులు



కోనేరుసెంటర్: బందరు నియోజకవర్గం మండల పరిధిలో వారిద్దరు తెలుగుదేశం పార్టీ నాయకులు.. ఒకే సామాజిక వర్గానికి చెందినవారు.. కుటుంబాలు వేరైనా రక్త సంబంధీకులు.. వరుసకు బాబాయి, అబ్బాయిలు.. వీరు ఇరువురు ఒకరిపై ఒకరు ప్రేమాభిమానాలను ఏ స్థాయిలో చూపించుకుంటారో.. అవినీతి వ్యవహారాల్లోనూ అదే స్థాయిలో వాటాలు పంచుకుంటారు.. గ్రామంలో బాబాయికి ఐదేళ్లుగా పదవి ఉన్నప్పటికీ ప్రభుత్వం సహకరించకపోవడంతో పంటి బిగువున ఆయన అవినీతి అక్రమాలకు సంకెళ్లు వేసుకోవలసివచ్చింది..

కూటమి అధికారంలోకి రావడంతో..

ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అవినీతికి అడ్డుగా ఉన్న సంకెళ్లను తెంచుకున్నాడు. ఈయనకు తోడు గతంలో మండలంలో చక్రం తిప్పి మాజీ ప్రజాప్రతినిధి హోదాలో అబ్బాయి సైతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో వీధికెక్కాడు. ఇంకే ముంది జాగా కనిపిస్తే చాలు పాగా వేసేస్తున్నారు. వీరి అవినీతి బాగోతం శ్రుతిమించటంతో ఆ ఊరి జనం ఆగ్రహంతో ఊగిపోతున్నారు. వారు చేస్తున్న అవినీతి, అక్రమాలను తీవ్రంగా ఖండిస్తున్నారు.

ప్రభుత్వ భూములపై కన్ను..

బందరు మండలం చిన్నాపురం గ్రామంలో ప్రభుత్వ భూములపై తెలుగుతమ్ముళ్ల కన్నుపడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగా గ్రామంలో ఉన్న ఖాళీ జాగాలన్నింటినీ సదరు తెలుగుతమ్ముళ్లు (బాబాయి, అబ్బాయి) కాజేసేస్తున్నారు. ఖాళీగా ఉన్న భూములను ఆక్రమించేసి వారికి ఆదాయం సమకూర్చే ఆదాయ వనరులుగా వాటిని మార్చేసుకుంటున్నారు. కబ్జా చేసిన భూములను చేపలు, రొయ్యల చెరువులుగా మార్చేస్తున్నారు. గ్రామస్తులను, కింది స్థాయి సిబ్బంది ప్రశ్నిస్తే ఏయ్ మేమెంటో తెలుసా.. మేమిక్కడ చెప్పిందే వేదం.. చేసిందే శాసనం అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీంతో చేసిది లేని గ్రామస్తులు మిన్నకుండిపోతున్నారు.

మెరకలోనూ అవినీతి మరక..

బాబాయి, అబ్బాయిలు గ్రామంలో భూములను యథేచ్ఛగా ఆక్రమించేస్తున్నారు. తాళ్లకాయశింకు గట్టు వెంబడి ఉన్న ఎనిమిది ఎకరాల ప్రభుత్వ భూమిపై ఆ ఇద్దరి కన్ను పడింది. అంతే గ్రామంలో పెద్దల పెత్తనం బెత్తం పుచ్చుకున్న ఇద్దరు ఆ భూమిని ఎలాగైనా ఆక్రమించుకోవాలని నిర్ణయించుకున్నారు. అందుకోసం గ్రామంలో ఉన్న శ్మశాన వాటికను వాడుకున్నారు. శ్మశాన వాటికను మెరక చేయిస్తున్నట్లు గ్రామస్తుల ఎదుట బిల్డప్ ఇస్తూ పగలు ఉపాధి పథకం కింద మట్టి తవ్వించి శ్మశానానికి ఒకటి రెండు ట్రిప్పులు మట్టిని తరలిస్తూ రాత్రి వేళ రొయ్యల చెరువులుగా మార్చే రోత పనులు చేయించారు. అలా ప్రభుత్వ భూమిలోని మట్టి కొంత మేర శ్మశానవాటికిలోకి తరలించి ఎక్కువ శాతం మట్టిని ప్రైవేటు ప్రయోజనాలకు తరలించారనే ఆరోపణలు లేకపోలేదు. అలా ఎనిమిది ఎకరాల భూమిలో మట్టిని తవ్వి నాలుగు ఎకరాల చొప్పున రెండు ముక్కలుగా చేసి రాత్రికి రాత్రి మోటార్‌ల ద్వారా చెరువుల్లోకి నీటిని నింపేస్తున్నారు.

ఉపాధిహామీ పనుల్లోనూ..?

గ్రామంలో ఇటీవల ఉపాధిహామీపనుల కింద పంచాయతీ చెరువులను తవ్వించారు. అందులోనూ బాబాయి, అబ్బాయి అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు లేకపోలేదు. చిన్నాపురంలో జరిగిన చెరువు పూడికతీత పనుల్లో వచ్చిన మట్టిని ఆ గ్రామానికి సమీప గ్రామంలో వారిరువురితో పాటు మరి కొంత మంది కలిసి కొనుగోలు చేసిన ప్రైవేటు స్థలంలోకి మట్టిని తరలించి మెరక చేయించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలా రూపాయి ఖర్చు లేకుండా సొంత స్థలంలోకి మట్టి తరలించుకుని, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల కింద చెరువు పనులకు బిల్లులు పెట్టుకున్నట్లు సమాచారం.

రొయ్యల చెరువులుగా మార్చి..

గ్రామంలో ఆక్రమించుకున్న ఎనిమిది ఎకరాల్లోని భూమిని రొయ్యల చెరువులుగా మార్చి తమ సమీప బంధువులకు గుట్టుచప్పుడు కాకుండా లక్షల్లో లీజుకు ఇచ్చుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ తతంగమంతా కళ్లెదుటే జరుగుతున్నా అటు పంచాయతీ, ఇటు రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవటం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. బాబాయి, అబ్బాయిల అవినీతి బాగోతంలో ఆ రెండు శాఖల అధికారులు పాలు పంచుకున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

పోలీస్ కల్యాణ మండపంలో అన్నసమారాధన



కోనేరుసెంటర్: ఈనెల 6వ తేదీన జరిగిన శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కృష్ణాజిల్లా పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పోలీస్ కల్యాణ మండపంలో జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు పోలీస్ రామాలయంలోని సీతారాములను దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పోలీస్ కల్యాణ మండపంలో అన్న సమారాధన కార్యక్రమంలో ఆయన పోలీస్ కుటుంబాలు, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. స్వయంగా వడ్డన చేశారు. భక్తులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. జిల్లా అడిషనల్ ఎస్పీ వీవీ నాయుడు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ భక్తులకు వడ్డించారు. బందర్ డీఎస్పీ సీహెచ్ రాజా, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ కార్యాలయం ఉద్యోగులు, ఏఆర్ఎస్ఐలు, ఆర్ఐలు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే

బంటుమిల్లి: స్థానిక సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బుధవారం యూకేజీ విద్యార్థులను ఫస్ట్ క్లాసులో చేరుస్తూ ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. డైరెక్టరు సాబూజాన్ పర్యవేక్షణలో హెచ్ఎం ఝాన్సీసాబూ, ఉపాధ్యాయినిలు కలిసి విద్యార్థులను ఫస్ట్ క్లాసులో చేర్చారు.

ఎంఎంసీ వద్ద మున్సిపల్ కార్మికుల ధర్నా

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్



ఎంఎంసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు

మచిలీపట్నంటౌన్: ఆప్కాస్ ద్వారా పనిచేస్తున్న మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, కార్మికులకు రిటైర్మెంట్ వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ కృష్ణా జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ మచిలీపట్నం కమిటీ, సీఐటీయూ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద నాయకులు, కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బూర సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని, డెత్, సిక్, రిటైర్మెంట్ అయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని, కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నాయకుడు వై. ఈశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మికుల సంఖ్య పెంచి పని భారం తగ్గించాలని, కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మచిలీపట్నం కార్యదర్శి సీహెచ్ జయరావు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ కార్మికుడు గత 30 సంవత్సరాలపైగా సేవలు అందించి రిటైర్ అయిన కార్మికుడ్ని గ్రాడ్యుటీ లేకుండా ఇంటికి పంపడం ప్రభుత్వానికి తగదన్నారు. గత సమ్మె కాల ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్షురాలు సీహెచ్ బుల్లెమ్మ, తాడిశెట్టి వెంకటేశ్వరరావు, లంక రాజు, బత్రాజు సుబ్బారావు, ఎర్రంశెట్టి విజయ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు కృషి

పెడన: ప్రభుత్వ బడులను ప్రైవేటు బడులకు దీటుగా తీర్చిదిద్దడానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో బుధవారం పెడన నియోజకవర్గంలోని పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఉపకరణాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రానున్న డీఎస్సీలో కూడా ప్రత్యేకంగా టీచర్లను నియమించడానికి చర్యలు చేపట్టిందన్నారు. ఎస్ఎస్ఏ ఏపీసీ ఎం.ఫణిదూర్జిటి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఉపకరణాలను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ఇంకా రాని వారుంటే తల్లిదండ్రులు కూడా గమనించి రానున్న వేసవిలో సీఆర్పీలు సర్వే చేసే సమయంలో పేర్లు నమోదు చేయించి ఉపకరణాలు పొందాలని ఆయన సూచించారు. మచిలీపట్నం డీవైఈవో శేఖర్‌సింగ్, ఎంఈవోలు దుర్గాప్రసాద్, హరనాథ్, త్రిపురసుందరి, మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, ప్రత్యేక అవసరాల కలిగిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సరిహద్దులో అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

కృత్తివెన్ను: రెండు జిల్లాలకు సరిహద్దుగా ఉన్నటువంటి కృత్తివెన్ను మండలంపై అప్రమత్తంగా ఉండాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. పోలీస్ స్టేషన్ తనిఖీలో భాగంగా ఆయన బుధవారం జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర్‌తో కలిసి కృత్తివెన్ను స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి, మండలంలో క్రైం రేటు తదితర అంశాలను ఎస్ఐ పైడిబాబును అడిగి తెలుసుకున్నారు. ఐజీ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో జాతీయ రహదారి రావడంతో ప్రమాదాల సంఖ్య పెరిగిందన్నారు. ప్రమాదాల నివారణకు మూడు సంవత్సరాలుగా జరిగిన సంఘటనలు బ్లాక్‌స్పాట్‌గా గుర్తించి తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలిస్తామన్నారు. హైవే పక్కన ఎక్కువగా చిల్లర దొంగతనాలు జరుగుతున్న విషయాన్ని ఆయనకు తెలపగా లోకల్‌పోలీసులకు సూచనలు చేస్తామన్నారు. ప్రమాదాలు, దొంగతనాల విషయంలో సీసీ కెమేరాల పాత్ర ముఖ్యమని ఈ మండలంలో సీసీ కెమేరాల ఏర్పాటు, పర్యవేక్షణ బావుందన్నారు. నాయకుల విగ్రహాలకు రక్షణగా కమిటీలు ఉండాలని విగ్రహం ఏర్పాటు చేసే సమయంలోనే లైటింగ్, సీసీ కెమేరాల ఏర్పాటు బాధ్యతలు వారే చూసుకోవాలన్నారు. ఆరు జిల్లాల పరిధిలో 22 వేల సీసీ కెమేరాల ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటికి 21 వేల కెమేరాలు ఏర్పాటు చేశామన్నారు. ఉండి మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని వెయ్యి సీసీ కెమేరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బందరు డీఎస్పీ చొప్పిడి రాజా, రూరల్ సీఐ నాగేంద్రకుమార్, బంటుమిల్లి ఎస్ఐ గణేష్‌కుమార్ ఉన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

గూడూరు: ఎస్సీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీపై రుణాలు మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.వనజ తెలిపారు. మండలానికి మొత్తం 27 యూనిట్లు మంజూరైనట్లు ఎంపీడీఓ తెలిపారు. సబ్సిడీపై అందించే రుణాలను సేవలు, రవాణా, వ్యవసాయ రంగాలుగా విభజించినట్లు ఆమె వెల్లడించారు. సేవల రంగానికి 40 శాతం సబ్సిడీతో టైప్-1లో రూ.2.5- 2.95 లక్షల వరకు, టైప్- 2లో రూ.3.1- రూ.5 లక్షల వరకు రుణాన్ని మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. రవాణా రంగానికి సంబంధించి టైప్- 1లో 60 శాతం సబ్సిడీతో రూ.3 లక్షల లోపు రుణాలు, టైప్- 2లో 40 శాతం రాయితీతో రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ విభాగంలో ఐదుగురు సభ్యుల బృందానికి 80 శాతం రాయితీతో రూ.10 లక్షల డ్రోన్లు మంజూరు చేస్తామని ఆమె తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు మే 10లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని ఆమె కోరారు.

కోడూరు: ఎస్సీ కార్పొరేషన్ లోన్ల కోసం ఎస్సీ సామాజిక వర్గం ప్రజలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సుధాప్రవీణ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 నుంచి మే నెల 10వ తేదీ వరకు రుణాలకోసం దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. ww-w.apobmmr.apcfrr.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులను నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ తెలిపారు.

ఘంటసాల: ఎస్సీ వర్గాలకు రాయితీపై స్వయం ఉపాధి రుణాల మంజూరుకు దరఖాస్తులు అందజేయాలని ఎంపీడీవో డి.సుబ్బారావు తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ మండలానికి రూ.102.45 లక్షల విలువైన 25 యూనిట్లు మంజూరైనట్లు చెప్పారు. దరఖాస్తు దారులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారని ఎంపీడీవో తెలిపారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం పదిలం



మాట్లాడుతున్న సీడీపీఓ గ్లోరి

మచిలీపట్నంటౌన్: స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ పక్షోత్సవాలలో భాగంగా బుధవారం నగరంలోని మల్కాపట్నం రైలుపేట అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవం ఘనంగా నిర్వహించారు. రైలుపేట, రిక్షాడ్రైవర్స్ కాలనీ, మల్కాపట్నం, చిట్టిబొంబాయి, ముస్తాఖాన్‌పేట ప్రాంతాల్లోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలను ఐసీడీఎస్ మచిలీపట్నం అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ గ్లోరి గర్భవతులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. గర్భవతి అయిన మొదలు బిడ్డకు రెండు సంవత్సరాలు నిండే వరకు జరిగే కాలంలో జాగ్రత్తలను ఆమె వివరించారు. సూపర్వైజర్ మాలతీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు వి.స్వర్ణలత, సీహెచ్ పద్మావతి, కే విజయ కుమారి, ఎస్.అంజనాదేవి, టి.మేరీ సౌజన్యలత, 19వ సచివాలయం అడ్మిన్ రాంబాబు, వెల్ఫేర్ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం విజయ కుమారి, 22వ సచివాలయం అడ్మిన్ బి.రమేష్, జీఎంఎస్‌కే వి. నాగమణి, ఆశా వర్కర్ నాగమణి పాల్గొన్నారు.

పెడన: పోషకాహారంతోనే ఆరోగ్యం బాగుంటుందని, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పేర్కొన్నారు. బుధవారం చిననందమూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు, గర్భిణులకు పోషకాలు కలిగిన ఆహారాన్ని పండ్లు, కోడిగుడ్లు, చిరుధాన్యాలు కలిగిన వాటిని అందజేశారు. ఈ సందర్భంగా పోషకాలు లోపించడం వల్ల కలిగే అనార్థాలను వారికి తెలియజేసి మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చేసిన ఈ కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ కె.కుమార్‌బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.బాబా, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ఎస్ రెడ్డి వలంటీర్లతో పాటు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎస్అనిల్‌కుమార్‌లను అభినందించారు.

చిన్నారుల ఆరోగ్యాన్ని గమనిస్తూ ఉండాలి

గూడూరు: చిన్నారులు ఎత్తుకు తగ్గ బరువు ఉన్నారో లేదో క్రమం తప్పకుండా చూసుకుంటూ ఉండాలని నారికేడాలపాలెం సర్పంచి జంపన రమాదేవి సూచించారు. పోషణ్ పక్వాడ్ పక్షోత్సవాలలో భాగంగా బుధవారం నారికేడాలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నారులకు షెడ్యూలు ప్రకారం ఇచ్చే వ్యాధినిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించడం ద్వారా భవిష్యత్తులో వారికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం కావన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఇచ్చే బాలామృతంతో పాటుగా చిన్నారులు తినగలిగే ఆహారాన్ని అందించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్త వాణి, నర్సమ్మ, జానకి, సీఎంఓ అనంతలక్ష్మి పాల్గొన్నారు.

తడి,పొడి చెత్తపై ఉపాధి కూలీలకు అవగాహన

తాడేపల్లి(ఘంటసాల): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ నిర్వహిస్తున్న తడి, పొడి చెత్త సేకరణకు ప్రజలంతా సహకరించాలని ఈఓపీఆర్డీ కె.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని తాడేపల్లి గ్రామంలోని ఉపాధి హామీ పథకం పనులు నిర్వహిస్తున్న కూలీలకు తడి, పొడి చెత్త నిర్వహణపై ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు బుధవారం అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటారని చెప్తూ పంచాయతీ అందించిన రెండు డబ్బాల్లో తడి పొడి చెత్తను వేర్వేరుగా వేసి గ్రీన్ అంబాసిడర్లు అందించాలన్నారు. ఈవో రాజశేఖర్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

- 'ఎన్డీఏ ప్రభుత్వానికి 'సుప్రీం' నోటీసు చెంపపెట్టు'

మచిలీపట్నంటౌన్: వక్ఫ్ చట్ట సవరణ బిల్లులోని పలు అంశాలపై ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి సుప్రీం కోర్టు బుధవారం నోటీసులు జారీ చేసి సమాధానం ఇవ్వాలని కోరటం ఆ ప్రభుత్వానికి చెంపపెట్టని ముస్లిం సంక్షేమ సంఘం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల అధికార ప్రతినిధి ఎండీ సదరుద్దీన్ ఖురేషి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బలవంతంగా అమలు పరిచిన వక్ఫ్ సవరణ చట్టానికి మద్దతు తెలిపిన తోక పార్టీలను సవాలు చేస్తూ ముస్లిం సంఘాలు, వైఎస్సార్ సీపీ సుప్రీం కోర్టులో వేసిన రిట్ పిటీషన్‌లపై సుప్రీం కోర్టు కేంద్రానికి నోటీసు పంపటం హర్షణీయమని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కోర్టులో పిటీషన్ వేసి రాష్ట్రంలోని ప్రతి ముస్లిం గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. వైఎస్ జగన్ ముస్లిం మైనారిటీల పక్షపాతిగా నిలిస్తే, రాష్ట్రంలో అధికారాన్ని వెలగబెడుతున్న టీడీపీ ముస్లింలను మరోసారి మోసం చేసి, శాశ్వత ద్రోహిగా మిగిలిపోయిందని దుయ్యబట్టారు. సీఎం చంద్రబాబుకు ముస్లింలపై వీసమంత అయినా ప్రేమాభిమానం ఉంటే ఈ బిల్లుకు ఇచ్చిన మద్దతును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ముస్లింలకు మద్దతుగా కోర్టులో రిట్ పిటీషన్ వేయాలని సవాల్ విసిరారు.

- బాధిత యువకుడికి ఆర్థిక సాయం

గణపేశ్వరం(నాగాయలంక): మండలంలోని గణపేశ్వరం గ్రామానికి చెందిన గుంటూరు బాబూరావు కుమారుడు అక్షయ్‌తేజ (19) జి.బి సిండ్రోమ్ అనే నరాల సంబంధిత వ్యాధితో మూడు నెలలకు పైగా బాధ పడుతుంటే రూ.10 వేలు ఆర్థిక సాయం అందించినట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ విభాగం జాయింట్ సెక్రటరీ చెన్ను రంగారావు బుధవారం చెప్పారు. యువకుడు ఎస్సీ పేద వర్గానికి చెందినవాడు కావడంతో వైద్య ఖర్చులకు ఆ కుటుంబ ఆర్థిక ఇబ్బందులు తెలుసుకుని తన మిత్రుడు మండవ జానకిరామయ్య(పిడుగురాళ్ళ)తో కలిసి నగదు వితరణ చేసామన్నారు. గుంటూరు సురేష్, పులిగుజ్జు కోటేశ్వరావు (పెదబాబు) ద్వారా ఈ మొత్తాన్ని యువకుడి తండ్రి బాబూరావు అందచేశామని తెలిపారు.

- మందుబాబులకు అడ్డగా..

మోపిదేవి: పాత గ్రామ పంచాయతీ స్థలం కూడా మందుబాబులకు అడ్డగా మార్చేసుకున్నారు. మోపిదేవిలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం ఎదురుగా పాత పంచాయతీ స్థలంలో ప్రతి రోజూ మందు సేవిస్తూ సీసాలను అక్కడనే పగులగొట్టి పోతున్నారు. పొద్దుపోతే చాలు మందుబాబులు దర్జాగా మందు తాగుతూ అల్లర్లు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇదేవిషయమై కూటమి నాయకులు జనసేన పార్టీ కార్యకర్త అనేక సార్లు స్పందనలో ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదని విచారం వ్యక్తంచేశారు.

- తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

అవనిగడ్డ: వేసవికాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరు మండలాల్లో ఉన్న రక్షిత మంచినీటి చెరువులన్నింటినీ నీటితో నింపుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

- గ్రామాల్లో సక్రమంగా జరగని రేషన్ సరఫరా

మోపిదేవి: మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ సరఫరా సక్రమంగా జరగడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. రేషన్ అందించే అధికారులు ప్రతి నెలా 17వ తేదీ లోపు సరుకులు రేషన్ షాపులకు అందించాల్సి ఉంటుంది. సరుకులు వచ్చిన నాటి నుంచి ఐదు రోజుల లోపుగా ఎండీయూ ద్వారా ఇంటింటా సరుకులు లబ్ధిదారులకు అందించాలి. కానీ 16వ తేదీ వరకు కొన్ని షాపులకు రేషన్ సరుకులు రాలేదని తెలుస్తోంది. సరుకులు పూర్తిస్థాయిలో ఇవ్వకుండా కార్డులను తగ్గించేందుకు ప్రభుత్వం ఇలాంటి పనులు చేస్తోందని కొంతమంది విమర్శిస్తున్నారు. సరుకులు ఇవ్వకుండా గడువులోపు పంపిణీ చేయాలని రెవెన్యూ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని డీలర్లు ఆవేదన చెందుతున్నారు. ఎండీయూలు డీపోల వారీగా సరుకు తీసుకుని ప్రతి ఇంటా ఇవ్వడం సకాలంలో పూర్తిచేయలేరని అంటున్నారు. రెవెన్యూ అధికారులు ఈ సమస్యపై దృష్టి పెట్టి గడువు పొడిగించాలని కోరుతున్నారు.

- చెరువులో చేపల సేకరణకు బహిరంగ వేలం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలోని పెదకళ్లేపల్లి శ్రీ దుర్గానాగేశ్వరస్వామివారి దేవస్థానానికి చెందిన చెరువులో చేపలు పట్టుకుని, నీరు తోడి అప్పగించేందుకు ఆలయ ప్రాంగణంలో బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా స్థానికులు మారుబోయిన పవన్ కళ్యాణ్ అత్యధికంగా రూ.21,501లకు హెచ్చుపాట పాడినట్లు ఆలయ డీసీ తెలిపారు. మోపిదేవి శ్రీసకలేశ్వరస్వామివారి ఆలయ కార్యనిర్వహణాధికారి జోగి ప్రవీణ, ఆలయ అధికారులు వెంకట రమణ, ఎంసీటీసీ కడకకొల్లు సీతారామాంజనేయులు, గ్రామ పెద్దలు అరజా వెంకటేశ్వరావు, అరజా కిరణ్‌కాంత్, తదితరులు పాల్గొన్నారు.

- వేదపాఠశాల నిర్వహణకు సహకారం అందిస్తాం

తాడేపల్లి(ఘంటసాల): మన సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించేందుకు ఏర్పాటు చేసే వేద పాఠశాల నిర్వహణకు సహకారం అందిస్తామని ఎన్నారై, ప్రొఫెసర్ మూల్పూరి వెంకట్రావు, సావిత్రి దంపతులు తెలిపారు. తాడేపల్లి లో శ్రీసద్గురు మలయాళ స్వాముల వారి పెద్దాశ్రమాన్ని వీరు బుధవారం సందర్శించారు. ఎన్నారై దంపతులు వేద పాఠశాల నిర్వహణకు అవసరమైన నిధులు సమకూరుస్తామని, వేదపాఠశాల ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో వ్యాసాశ్రమం తరుపున వేర్పేడు వ్యాసాశ్రమ ఉత్తరాధికారి అస్సంగానంద గిరి స్వామి వెంకట్రావు, సావిత్రి దంపతులను అభినందించి దుశ్శాలువాతో సత్కరించి ఆశీస్సులు అందించారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, ఆశ్రమ నిర్వాహకులు కావూరి కోదండ రామయ్య, మొవ్వ శ్రీరామమూర్తి, గొర్రెపాటి సురేష్, ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

- మహా గణపతికి అభిషేక పూజలు

భావదేవరపల్లి(నాగాయలంక): పౌర్ణమి తదుపరి వచ్చే సంకట హర చతుర్థి పర్వదినం పురస్కరించుకుని దేవాలయాల్లో బుధవారం మహా గణపతికి విశేష అభిషేకాలతో ఘనంగా పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. మండలంలోని భావదేవరపల్లిలో కొలువైన శ్రీగణపతి సహిత శ్రీఅన్నపూర్ణదేవి సమేత శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో వ్యవస్థాపక ధర్మకర్తలు పూషడపు నిరంజనరావు, శివసత్యవతి పర్యవేక్షణలో అర్చకుడు భరత్ కుమార్ శర్మ బ్రహ్మత్వంలో గణపతిస్వామికి గంధం, పసుపు కుంకుమ తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపి సుందరంగా అలంకరించారు. నాగాయలంక లోని శ్రీప్రసన్న గణపతి దేవస్థానంలో అర్చకుడు అంబా సాయికిరణ్ శర్మ నేతృత్వంలో సంకట హర చతుర్థి పూజ జరిపి విశేష అలంకారంలో తీర్చిదిద్దారు. భక్తులు గణపతిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

- పాఠ్యపుస్తకాల స్టాక్ పాయింట్ పరిశీలన

పెడన: విద్యార్థులకు అందజేసే స్కూలు కిట్స్ పాఠ్యపుస్తకాలు, ఇతర సామగ్రిని ఉంచడానికి ఏర్పాటు చేసిన స్టాక్‌పాయింట్‌ను సమగ్ర శిక్ష ఏపీసీ ఎం.ఫణిదూర్జిటి పరిశీలించారు. బుధవారం ఆయన పట్టణంలోని భట్ట జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలు పునః ప్రారంభానికి ముందే విద్యార్థులకు స్కూల్ కిట్స్ అందించేలా స్థానిక అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ బడులలో చదివే ప్రతి ఒక్కరికీ కిట్ అందించాల్సి ఉంటుందన్నారు. సీఎంవో రమేష్, హెచ్ఎం అశోక్, సీఆర్పీలు ఉన్నారు.

- అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

బంటుమిల్లి: స్థానిక అపార్టుమెంట్లలో ఉంటున్న కుటుంబాలవారికి బుధవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఫైర్ ఆఫీసరు జి.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో అపార్టుమెంటు వాసులకు కరెంటు, గ్యాస్ తదితర ప్రమాదాల నివారణపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక గుల్లపచెరువు వద్దగల అమృత హైట్స్ అపార్ట్‌మెంట్‌లో బుధవారం అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో అపార్ట్‌మెంట్ వాసులకు పలు అంశాలను వివరించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రచురించిన కరపత్రాలను వారికి అందించారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

- మట్టి తోలకాలను అడ్డుకోండి

పెడన: మండల వ్యాప్తంగా మట్టి తోలకాలను ఎట్టి పరిస్థితుల్లో జరగకుండా చూడాలని, పూర్తి బాధ్యత క్షేత్రస్థాయిలోని వీఆర్వోలదేనని ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం ఆయన మండలంలోని వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తోలుతున్నట్లు మీకు కాకుండా నేరుగా నాకు సమాచారం వస్తే మాత్రం ఉపేక్షించేది లేదని, మీ నుంచే ముందుగా సమాచారం రావాలని ఆదేశించారు. ఇన్‌చార్జి ఆర్ఐ విజయలక్ష్మి, వీఆర్వోలు పాల్గొన్నారు.